కనీస వసతులు కరువు

- అధ్వానంగా పాఠశాల నిర్వహణ
- వేధిస్తున్న తాగునీటి సమస్య
- దారుణంగా టాయిలెట్లు

పెనమలూరు: పోరంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పరిస్థితులు దయనీయంగా ఉన్నాయి. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు కనీస వసతులు కరువయ్యాయి. గత ప్రభుత్వ హయాంలో నాడు–నేడులో భాగంగా విద్యార్థులకు పూర్తి వసతులు కల్పించగా కూటమి పాలనలో ఏడు నెలల్లోనే పాఠశాలకు గ్రహణం పట్టించారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. పోరంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దాదాపు 600కు పైగా నిరుపేద విద్యార్థులు చదువుతున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో రూ. లక్షలు ఖర్చు చేసి ఈ పాఠశాలను అన్ని హంగులతో తీర్చిదిద్దారు. ముఖ్యంగా బాలబాలికలకు ప్రత్యేకంగా టాయిలెట్లు ఏర్పాటు చేశారు. మినరల్‌వాటర్ ప్లాంట్, టైల్స్, పంపులు, వాష్‌బేసిన్స్, ఇలా అనేక వసతులు విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. దీంతో విద్యార్థులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చదువుకున్నారు.

మారిన పరిస్థితులు

కాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది నెలలకే పాఠశాలలో పరిస్థితులు తారుమారయ్యాయి. చేతులు కడుక్కోవడానికి నీరు, బాత్‌రూమ్స్, తాగునీరు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించడానికి ఏర్పాటు చేసిన మినరల్‌వాటర్ ప్లాంట్ గత కొద్ది నెలలుగా పని చేయడం లేదు. మధ్యాహ్న భోజనం చేసిన తర్వాత చేతులు కడుక్కోవడానికి ఏర్పాటు చేసిన ప్రాంతంలో పంపులు లేవు. ఉన్న పంపులు ఊడిపోగా వాటి స్థానంలో కొత్తగా పంపులు బిగించలేదు. నీటి మోటరు సక్రమంగా పని చేయకపోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు.

తలుపులు లేని టాయిలెట్లు

పాఠశాలలో టాయిలెట్ల నిర్వహణ లోపించడంతో దారుణంగా మారాయి. బాలుర టాయిలెట్లలో పంపులు లేవు. మరుగుదొడ్డి తలుపు ఊడిపోయింది. తలుపులు లేకపోవడంతో విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. టాయిలెట్లు సక్రమంగా శుభ్రం చేయకపోవడంతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతున్నాయి. బాలికల టాయిలెట్ల పరిస్థితి మరీ అధ్వానంగా ఉంది. పాఠశాలలో పరిస్థితులు దారుణంగా ఉన్నాయని, తమ పిల్లలు ఎలా చదువుకోగలుగుతారని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.



పోరంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల



పని చేయని మినరల్ వాటర్ ప్లాంట్

నేతలు ఎక్కడ..?

పోరంకి పాఠశాలను వేదికగా చేసుకొని తరచుగా హడావుడి చేసి పబ్లిసిటీ చేసుకునే నేతలు ఎక్కడ అని విద్యార్థుల తల్లిదండ్రులు నిలదీస్తున్నారు. పాఠశాలలో విద్యార్థులు కనీస వసతులు లేక ఇబ్బందులు పడుతుంటే నేతలు కాని.. అధికారులు కాని స్పందించకపోవడంపై వారు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అధికార పార్టీ నేతలు ఒక్కసారి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టిపెట్టాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.



చేతులు కడుక్కోవడానికి కుళాయిలే లేవు

క్లుప్తంగా

బాల ఏసు చర్చి ఉత్సవాలకు విరాళం



పెనమలూరు: గోసాలలో బాల ఏసు చర్చి సిల్వర్ జూబ్లీ ఉత్సవాలకు పెనమలూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి విరాళం అందజేశారు. సంఘ సభ్యులు, గ్రామస్తులు శుక్రవారం కానూరులో దేవభక్తుని చక్రవర్తిని కలిసి ఉత్సవాలకు ఆహ్వానించగా ఆయన రూ. 10 వేలు విరాళం అందజేశారు. క్రైస్తవ సోదరులు సిల్వర్ జూబ్లీ వేడుకలను భక్తిశ్రద్ధలతో చేసుకోవాలని చక్రవర్తి సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ పోలవరపు రవి, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

డిస్కస్ త్రోలో బంగారు పతకం



ఉయ్యూరు: రాష్ట్రస్థాయి పాలిటెక్నిక్ అంతర కళాశాలల పోటీల్లో కలవపాముల శ్రీ జ్యోతి పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థి సీహెచ్ వెంకట సాయి బాల కోటేశ్వరరావు డిస్కస్ త్రోలో బంగారు పతకం సాధించాడు. గత నెల 20–30 తేదీల్లో విశాఖపట్నంలో 27వ రాష్ట్రస్థాయి అంతర్ కళాశాలల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో బాలకోటేశ్వరరావు ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాన్ని సాధించాడు. ప్రతిభ చాటిన విద్యార్థి బాలకోటేశ్వరరావును కళాశాల కరస్పాండెంట్ సూరపనేని వెంకటరమణ, ప్రిన్సిపాల్ జన్ను శివకుమార్, ఏఓ మురళీకృష్ణ శుక్రవారం అభినందించారు.

దోమల నివారణకు చర్యలు



కంకిపాడు: దోమల నిర్మూలనతోనే ప్రజారోగ్య పరిరక్షణ సాధ్యమని మలేరియా సబ్ యూనిట్ అధికారి జి.శ్రీనివాసరావు అన్నారు. గ్రామ పంచాయతీ, వైద్య ఆరోగ్య శాఖ సంయుక్త ఆధ్వర్యంలో దోమల నిర్మూలనకు శుక్రవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దోమల వ్యాప్తిని అరికట్టవచ్చన్నారు. డ్రెయిన్లలో చెత్త, వ్యర్థాలు పేరుకుపోకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సాంబశివరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావు, హెల్త్ అసిస్టెంట్ శ్రీధర్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

నున్న సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రద్దీ



నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో శుక్రవారం రద్దీ నెలకొంది. ఆస్తుల క్రయ విక్రయాల రిజిస్ట్రేషన్ చేయించుకునే వారితో కిటకిటలాడింది. ఫిబ్రవరి నుంచి ఆస్తుల మార్కెట్ విలువ పది శాతం పెరుగుతున్నందున చివరి రోజు ఉదయం నుంచి రిజిస్ట్రార్ కార్యాలయం వద్దకు ప్రజలు అధిక సంఖ్యలో చేరుకోవడం కనిపించింది. సర్వర్ మధ్య మధ్యలో మొరాయించింది. రోజువారి కంటే అదనపు సంఖ్యలో రిజిస్ట్రేషన్లు జరిగినట్లు కార్యాలయం సిబ్బంది తెలిపారు.

యథేచ్ఛగా కోడ్ ఉల్లంఘన



ఉయ్యూరు: ఎన్నికల కోడ్ అమలుపై ఉదాసీనత కనిపిస్తోంది. ఉయ్యూరు పట్టణంతో పాటు గ్రామాల్లో అధికార పార్టీ ఫ్లెక్సీలు కనిపిస్తున్నా అధికారులు అటు వైపు కన్నెత్తి చూడటం లేదు. నిబంధనల ప్రకారం రాజకీయ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలను తొలగించాల్సి ఉన్నా మొక్కుబడి చర్యలతో అధికార పార్టీకి కొమ్ము కాస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఉయ్యూరు మున్సిపాలిటీలో రెండు రోజులుగా ఫ్లెక్సీల తొలగింపు పనులు మొక్కుబడిగా సాగుతున్నాయి. ఇదే విషయమై కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావును వివరణ కోరగా.. ఎన్నికల కోడ్ అమలులో ఉందని, 24 గంటల్లో బ్యానర్లు మొత్తం తొలగిస్తామని చెప్పారు. కాగా మండలంలోని అన్ని గ్రామాల్లోనూ ఫ్లెక్సీల తొలగింపు చర్యలు నత్తనడకన సాగడం గమనార్హం.

పశుపోషణలో యాజమాన్య చర్యలు కీలకం



మద్దూరులో గోకులం షెడ్డును ప్రారంభిస్తున్న పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారి నరసింహులు

కంకిపాడు: పశుపోషణలో మేలైన యాజమాన్య చర్యలు కీలకమని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి నరసింహులు అన్నారు. మండలంలోని మద్దూరు గ్రామంలో శుక్రవారం మెగా పశువైద్య శిబిరం నిర్వహించారు. పశువులకు ఉచిత చూడి పరీక్షలు, సాధారణ వ్యాధులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. దూడల అందాల పోటీలు నిర్వహించారు. పోటీల్లో వల్లభనేని సురేష్, జడ బాబూరావు, వల్లభనేని ప్రసాద్‌కు చెందిన దూడలు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను గెలుచుకున్నాయి. ఈ సందర్భంగా గ్రామంలో నిర్మించిన గోకులం షెడ్లను ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు గొంది శివరామకృష్ణ ప్రసాద్, సర్పంచ్ చిప్పల రామదాసు, కాసరనేనివారిపాలెం సర్పంచ్ పి.వరప్రసాద్, డెప్యూటీ డైరెక్టర్లు గోపీచంద్, శ్రీనివాసరావు, ఏడీ శ్రీనివాసరావు, డాక్టర్ కె.మాధవరావు, డాక్టర్ ఎస్‌వీఎస్ రంగారావు, డాక్టర్ జి.రవికుమార్, డాక్టర్ బాబూరావు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పెనమలూరు: విజయవాడ–మచిలీపట్నం జాతీయ రహదారి గంగూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు అవ్వడంతో పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ కథనం మేరకు.. గంగూరు చేపల కుండీల ప్రాంతానికి చెందిన రమణ గురువారం రాత్రి బందరు రోడ్డు దాటుతుండగా విజయవాడ వైపు నుంచి వచ్చిన కారు ఢీ కొట్టింది. ఈ ఘటనలో అతడికి బలమైన గాయాలు అయ్యాయి. దీంతో అతడిని పోరంకి ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చారు. అతని భార్య సూర్యలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

మహిళపై దాడి.. కేసు నమోదు

పెనమలూరు: పెదపులిపాక గ్రామంలో మహిళపై ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులు దాడి చేయడంతో పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ కథనం మేరకు.. గ్రామానికి చెందిన దేవరపల్లి మణి తన బంధువు అయిన దేవరపల్లి కిరణ్ తండ్రికి ఆరోగ్యం బాగాలేదంటే నగలు తాకట్టు పెట్టి రూ. 30 వేలు ఇచ్చింది. అయితే అప్పుగా ఇచ్చిన సొమ్ము తిరిగి చెల్లించమని కిరణ్‌ను కోరింది. దీనికి కిరణ్‌తో పాటు అతని తండ్రి శిఖామని, సోదరుడు అఖిల్ అప్పు ఇచ్చిన మణిపై దాడి చేశారు. ఈ ఘటనపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

మరో ఘటనలో..

పెనమలూరు: మామపై అల్లుడు దాడి చేయడంతో పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ కథనం మేరకు.. పోరంకి గ్రీన్ ఫీల్డ్స్ అపార్టుమెంట్‌లో వై.కృష్ణప్రసాద్ కుటుంబ సభ్యులతో ఉంటున్నాడు. అతనికి ఇద్దరు కుమార్తెలు. రెండవ కుమార్తె సౌమ్యశ్రీ పెనమకూరు గ్రామానికి చెందిన ఈశ్వర వెంకట నాగసాయికృష్ణ అనే వ్యక్తిని వివాహం చేసుకుంది. వీరికి ఇద్దరు పిల్లలు. కాగా సౌమ్యశ్రీను భర్త వేధించడంతో విడాకులు తీసుకుని పోరంకి పుట్టింట్లో ఉంటుంది. కాగా ఈశ్వరవెంకట నాగసాయికృష్ణ పోరంకి వచ్చి మామ కృష్ణప్రసాద్, భార్య సౌమ్యశ్రీతో గొడవపడి దాడి చేశాడు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

వృద్ధుడు అదృశ్యం

పెనమలూరు: యనమలకుదురులో వృద్ధుడు అదృశ్యమైన ఘటనపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసుల కథనం మేరకు.. వరంగల్ జిల్లా ఖానాపూర్ మండలం యాపచెట్టు తండాకు చెందిన సరియా(75) గత కొద్ది రోజుల క్రితం యనమలకుదురులో బంధువు ఇంటికి వచ్చాడు. జనవరి 25వ తేదీన తిరిగి ఇంటికి వెళతానని బయలుదేరిన అతను వరంగల్‌కు చేరుకోలేదు. దీంతో అతని కుమారుడు భుక్యా వెంకన్న యనమలకుదురు పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ తెలియలేదు. వెంకన్న ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఘనంగా వాసవి కన్యకాపరమేశ్వరి ఆత్మార్పణ మహోత్సవం



ప్రసాదంపాడులో వాసవీ అమ్మవారి వద్ద పూజలు నిర్వహిస్తున్న క్లబ్ ప్రతినిధులు



కానూరులో శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ప్రసాదంపాడు రామాలయంలో శుక్రవారం వాసవీ జాగృతి ఇంటర్నేషనల్ పితృ దేవోభవ క్లబ్ ఆధ్వర్యంలో శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి ఆత్మార్పణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేసి పలు ప్రత్యేక పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వాసవీ అమ్మవారి చిత్రపటం వద్ద కుంకుమ పూజలు చేసి పట్టు వస్త్రాలు అందజేశారు. సమాజంలో ఆర్యవైశ్యులకు ఉన్న విశిష్ట స్థానాన్ని క్లబ్ ప్రతినిధులు వివరించారు. క్లబ్ అధ్యక్షుడు జూలూరు నాగేశ్వరరావు, సెక్రెటరి ఉడత్తు నరేంద్ర, నాయకులు సర్నాల బాలాజీ, గూడవల్లి నరసింహరావు, రామవరప్పాడు సర్పంచ్ వరి శ్రీదేవి, కోశాధికారి పద్మనాభం, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పెనమలూరు: కానూరులో శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి విశ్వరూప దర్శన (ఆత్మార్పణ) పర్వదినం వైభవంగా చేశారు. కానూరు అశోక్ నగర్ వెలగపూడి కోల్డ్ స్టోరేజీ ప్రాంగణంలో పెనమలూరు మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన చేశారు. సాయంత్రం అమ్మవారికి పల్లకీసేవ, పలు సాంస్కృతిక ప్రదర్శనలు చేశారు. దాతల వందనపు సాంబశివరావు, బాస్కెట్ నాగరాజు, ఆర్య వైశ్య మండల సంఘ సభ్యులు బుద్ధా లక్ష్మణకుమార్, తటపర్తి సతీష్‌కుమార్, తాతా వెంకట కిషోర్ కుమార్, చక్కా లక్ష్మణరాయుడు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక ఏలూరురోడ్డులోని వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జంక్షన్ ప్రధాన రహదారుల్లో అమ్మవారి ఊరేగింపు జరిగింది. ఆర్య వైశ్య సంఘం నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గన్నవరం రూరల్: మండలంలోని వీరపనేనిగూడెం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో శనివారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని గుణదల డీఈ పి.హరిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరపనేనిగూడెం, తెంపల్లి, మర్లపాలెం జగనన్న కాలనీ, బల్లిపర్రు, మెట్లపల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

సబ్‌రిజిస్ట్రార్‌పై టీడీపీ నేత ఆగ్రహం

హనుమాన్‌జంక్షన్ రూరల్: కానుమోలు సబ్‌రిజిస్ట్రార్ ప్రజాప్రతినిధులను గౌరవించడం లేదని టీడీపీ నాయకుడు, నాగార్జున సాగర్ ఎడమకాలువ ప్రాజెక్టు కమిటీ వైస్‌చైర్మన్ ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. బాపులపాడు మండలం రంగన్నగూడెం వ్యవసాయ భూముల మార్కెట్ విలువ పెంపుపై సబ్‌రిజిస్ట్రార్ డి.జయరాజుకు వినతిపత్రం ఇచ్చేందుకు శుక్రవారం ఆళ్ల వెంకట గోపాలకృష్ణ వెళ్లారు. అయితే వినతిపత్రం స్వీకరించకుండా సాయంత్రం ఐదు గంటల తర్వాత రమ్మని సబ్‌రిజిస్ట్రార్ చెప్పడంతో ఇరువురి మధ్య వివాదం రేగింది. సబ్ రిజిస్ట్రార్ వ్యవహారంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లతానని ఆళ్ల హెచ్చరించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



సదస్సులో మాట్లాడుతున్న వెంకట సుబ్బారావు

రామవరప్పాడు: పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించుకోవాలని గ్రీన్ ఇండియా అవార్డు గ్రహీత, పర్యావరణ వేత్త, ఆంధ్ర స్వచ్ఛ బడి ప్రక్రియల వ్యవస్థాపక సలహాదారు వెంకట సుబ్బారావు అన్నారు. విజయవాడరూరల్ మండలం ఎనికేపాడులోని ఎస్సార్కే ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ పర్యావరణాన్ని, మానవాళి మనుగడను కాపాడుకోవడానికి అమలు చేయాల్సిన విధి, విధానాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సేంద్రియ, ఘన వ్యర్థాలను క్షేత్ర స్థాయిలో శాస్త్రీయ పద్ధతులతో సేకరించి ఎరువుగా తయారు చేయడం వంటి ఆధునిక ప్రక్రియల ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవచ్చునని తెలిపారు. వ్యర్థాల సేకరణ, స్థిరమైన నిర్వహణ, పునరివినియోగంపై వివరించారు. అనంతరం కళాశాలలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ బోయపాటి అప్పారావు, సెక్రటరీ బోయపాటి శ్రీకృష్ణ, డీన్ రమేష్, ప్రిన్సిపాల్ ఎం. ఏకాంబరం నాయుడు, సివిల్ విభాగాధిపతి సత్యనారాయణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉంగుటూరు ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా జోగేశ్వరరావు

ఉంగుటూరు: ఉంగుటూరు ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా బాపులపాడు ఎంపీడీవో కె.జోగేశ్వరరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. చెత్త నుంచి సంపద తయారు కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రవర్తన నియమావళి పటిష్టంగా అమలు చేయాలని ఆదేశించారు. పింఛన్లు లబ్ధిదారులకు సకాలంలో అందజేయాలని పేర్కొన్నారు.

ఉద్యానవన పంటల సాగులో మెళకువలు పాటించాలి



గోసాలలో మిరప పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త మంజుల, ఉద్యానవన అధికారులు

పెనమలూరు: ఉద్యానవన పంటల సాగులో రైతులు మెళకువలు పాటించాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ వి.మంజువాణి అన్నారు. గోసాల, వణుకూరు గ్రామాల్లో బంతి, మిరప, పామాయిల్ తదితర పంటలను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు పూలతోటల్లో ఆకుమచ్చ తెగులు, చీడ పీడ నివారణకు యాజమాన్యం పాటించాలన్నారు. పేనుబంక, తామరపురుగు, మొగ్గ తులుచు పురుగు నివారణకు డైమిథొయేట్ 2 ఎంఎల్, లేదా అసిఫేట్ 1.5 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలని సూచించారు. మిరపలో నల్లతామర పురుగు నివారణకు వేపనూనె ఉపయోగించాలన్నారు. పామాయిల్ తోటలో గానోడెర్మా కుళ్ల తెగులు నివారణకు 10 ఎంఎల్ కాలిక్సన్ 10 ఎంఎల్ నీటిలో కలిపి వేరుద్వారా ఎక్కించాలన్నారు. సేంద్రాయ ఎరువులతో కుళ్ల తెగులు నివారించగలుగుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల ఉద్యానవన అధికారి చందు జోసెఫ్ సుందరం, చాముండేశ్వరి పాల్గొన్నారు.

వీధి బాలల సంరక్షణకు ప్రత్యేక హక్కులు



సదస్సులో మాట్లాడుతున్న జడ్జి జయలక్ష్మి

గన్నవరం: మండలంలోని దావాజీగూడెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శుక్రవారం వీధి బాలల దినోత్సవం సందర్భంగా మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మండల లీగల్ సెల్ చైర్మన్, సబ్‌కోర్టు జడ్జి కె. జయలక్ష్మి మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా పది లక్షల మంది వీధి బాలలు నిరాశ్రయులుగా ఉన్నారని చెప్పారు. వీరి సంరక్షణ కోసం రాజ్యాంగం ప్రత్యేకమైన హక్కులను కల్పిస్తోందని తెలిపారు. మన పరిసరా ప్రాంతాల్లో వీధి బాలలు ఎక్కడైన తారసపడితే 15100, 1098 ట్రోల్ ఫ్రీ నెంబర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జీఎస్ఆర్ మూర్తి, ఉపాధ్యక్షురాలు వైఆర్ శారద, పారా లీగల్ వలంటీర్ రామినేని రవిబాబు, బోడపాటి రవి తదితరులు పాల్గొన్నారు.

పురుషోత్తపట్నంలో ఉచిత వైద్య శిబిరం



మందులు అందజేస్తున్న సర్పంచ్ రోహిణి

గన్నవరం రూరల్: మండలంలోని పురుషోత్తపట్నం పంచాయతీ కార్యాలయం వద్ద డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ ఆస్పత్రి ఆధ్వర్యాన శుక్రవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని సర్పంచ్ మాదల రోహిణి ప్రారంభించారు. డాక్టర్ ఆర్.శిల్ప మాట్లాడుతూ ప్రజలు వ్యాధులు, విషజ్వరాలు పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కాచి చల్లార్చిన నీటినే తాగాలని చెప్పారు. దీని వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని వివరించారు. 270 మందికి పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులను అందజేశారు. డాక్టర్‌లు కె.అఖిల్, వై.రమణి, శ్రీనివాస్, కె.ప్రవళిక, ఉపసర్పంచ్ కుంటముక్కల శివయ్య, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాల ఏసు ఉత్సవాలు



ప్రసంగిస్తున్న ఫాదర్ బాల

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక గుడివాడరోడ్డులోని జ్యోతినగర్ ఆర్సీఎం చర్చి అద్భుత దివ్య బాల ఏసు ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆర్సీఎం చర్చిను విద్యుత్ దీపాలతో వైభవంగా అలంకరించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏలూరు మేత్రాసనం ఫాదర్ బాల దైవ సందేశాన్ని అందించారు. చర్చి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మరియమ్మ, బాల ఏసు, ఏసుక్రీస్తు ప్రతిమలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. జ్యోతినగర్ విచారణ గురువు చేబ్రోలు జోసఫ్ తంబి, జేఎంజే సిస్టర్స్ ఆంథోనమ్మ, మంజు, భాగ్య, అనంతమ్మ, అన్నమ్మ పాల్గొన్నారు.

ప్రజా హక్కుల సాధనకు సీపీఎం కృషి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఎం నేతలు

కంకిపాడు: ప్రజల హక్కుల పరిరక్షణ, సాధనకు సీపీఎం కృషి చేస్తుందని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు పి.రంగారావు పేర్కొన్నారు. కంకిపాడులోని మండేపూడి భవన్‌లో సీపీఎం రాష్ట్ర మహాసభల వాల్ పోస్టరును శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ సీపీఎం రాష్ట్ర మహాసభలు ఈ నెల 1, 2, 3 తేదీల్లో నెల్లూరు నగరంలో నిర్వహిస్తున్నారని తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదలపై భారాలు మోపుతున్నాయన్నారు. పెట్టుబడిదారులకు రాయితీలు కల్పిస్తూ పేదల రక్తాన్ని దోచుకుంటున్నాయని మండిపడ్డారు. భవిష్యత్తు కార్యక్రమాలను మహాసభలో రూపొందించడం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి తాడంకి నరేష్, సీహెచ్ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.